క్లుప్తంగా

అభిమాననేతకు స్వాగతం

ఫిరంగిపురం: మండలంలోని రేపూడి గ్రామశివారులో వలంటీర్లుకు వందనం కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఫిరంగిపురంలోని ఎంపీడీఓ కార్యాలయం వద్దనుండి సభాస్థలివరకు ఎమ్మెల్యే మేకతోటి సుచరిత, పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు ఏర్పాటు చేసిన రంగురంగుల తోరణాలు, పార్టీ జెండాలు, రోడ్డు కిరువైపులా రెపరెపలాడుతున్న జెండాలతో రంగుల మయంగా మారింది.

అభిమాన నేతకోసం..

ఫిరంగిపురం: రేపూడిగ్రామంలో నిర్వహించిన సభ అనంతరం ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి హెలీప్యాడ్ వద్దకు చేరుకున్నారు. కాగా రోడ్డు కిరువైపులా చేరుకున్న అభిమానులు జననేత జగనన్న ఫొటోలు తీసేందుకు పలువురు ఎంతో ఉత్సాహం చూపారు.

ఉప్పొంగిన ఉత్సాహం

ఫిరంగిపురం: వలంటీర్లకు వందనం సభకు వస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి స్వాగతం పలికేందుకు ముందుగానే గొల్లపాలెం గ్రామ యువకులు రెట్టించిన ఉత్సాహంతో వాహనాల ర్యాలీ నిర్వహించారు. తీన్‌మార్ బ్యాండ్‌తో ద్విచక్ర వాహనాల ర్యాలీగా సభాస్థలానికి చేరుకున్నారు.

కార్మికుల భద్రత, మెరుగైన ఉపాధే లక్ష్యం

నగర కమిషనర్ నిర్మల్ కుమార్

మంగళగిరి: కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన నేషనల్ యాక్షన్ ఫర్ మెకనైజ్డ్ శానిటేషన్ ఏకోసిస్టం(నమస్తే) పథకంలో ప్రతి ఒక్క పారిశుద్ధ్య కార్మికుడు తప్పనిసరిగా రిజిస్టర్ చేసుకోవాలని మంగళగిరి- తాడేపల్లి కార్పొరేషన్ కమిషనర్ వి.నిర్మల్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. పారిశుద్ధ్య కార్మికులు, డ్రైవర్లు, హెల్పర్లలతో ఆయా పనులలో పరోక్షంగా ప్రత్యక్షంగా పనిచేస్తున్న కార్మికుల భద్రతతో పాటు మెరుగైన ఉపాధి కల్పించడమే నమస్తే కార్యక్రమం లక్ష్యమని చెప్పారు. పథకంలో నమోదు చేసుకున్న వారికి ప్రత్యేక సదుపాయాలు, ఆయుష్మాన్ భారత్ ద్వారా వైద్య సేవలు అందుతాయని వివరించారు.

ధర్మభిక్షాన్ని ఆదర్శంగా తీసుకోవాలి



మంగళగిరి: నిబద్ధతతో ప్రజాసేవ చేసిన సీపీఐ నాయకుడు ధర్మభిక్షాన్ని ఆదర్శంగా తీసుకోవాలని సీపీఐ నాయకుడు కంచర్ల కాశయ్య తెలిపారు. పట్టణంలోని ఐబీఎన్ భవన్ ప్రెస్‌క్లబ్‌లో గురువారం ధర్మభిక్షం జయంతి నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు వాకా రామ్‌గోపాల్ గౌడ్, కారుమంచి రామారావు, జాలాది జాన్‌బాబు, భూపతి, రమేష్, వాకా మంగారావు, తాతా కోటయ్య, కాగితాల స్వాతి పాల్గొన్నారు.

రేపూడిలో వైద్యశిబిరం

ఫిరంగిపురం: రేపూడి గ్రామంలో ఆరు వైద్యశిబిరాలు ఏర్పాటు చేసినట్లు జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి విజయలక్ష్మి తెలిపారు. నుదురుపాడు, ఫిరంగిపురం, మందపాడు, పెదపలకలూరు, మేడికొండూరు పీహెచ్‌సీలకు చెందిన సుమారు 60 మంది ఆరోగ్యసిబ్బంది ఆరు వైద్యసేవలందించారు. సుమారు 985 మందికి పరీక్షలు చేసి మందులు అందజేశారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

నేషనల్ గ్రీన్ కోర్ రాష్ట్ర సంచాలకురాలు పి.స్రవంతి



పర్యావరణంపై విద్యార్థులకు అవగాహన కలిగిస్తున్న స్రవంతి

పొన్నూరు: పర్యావరణాన్ని పరిరక్షించుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని నేషనల్ గ్రీన్ కోర్ రాష్ట్ర సంచాలకురాలు పి.స్రవంతి అన్నారు. పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతో పాటు పలు ప్రైవేటు పాఠశాలలను గురువారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. కేంద్ర పర్యావరణ శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణతో కూడిన విద్య అమలు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణకు విద్యార్థులు తీసుకోవలసిన జాగ్రత్తలపై ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లోని విద్యార్థులకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ప్రస్తుతం వాతావరణంలో వస్తున్నటువంటి విపరీతమైన మార్పుల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించి వారిని పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు చేయటం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం అని వివరించారు. ప్రతి విద్యార్థికి మొక్కలు పెంచివలసిన ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారులు శోభాచంద్, శ్రీనివాసరెడ్డి, గ్రీన్ కోర్ జిల్లా సమన్వయకర్త షేక్ గౌసుల్ మీరా, జిల్లా సైన్స్ అధికారి ఎ.రవికుమార్, ప్రాజెక్ట్ ఆఫీసర్ సత్యనారాయణ, శివకుమార్, పాఠశాలల డైరెక్టర్లు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

అభిమానం హోరెత్తించె..



అభిమానం పూల వర్షమై... జగనన్నను చూసిన ఆనందంలో కేరింతలు కొడుతూ పూలను విరజిమ్ముతున్న అభిమానులు



హద్దుల్లేని ఆనందం .. జగనన్నను చూసి దాబాలు చెట్లపై నుంచి అభివాదం చేస్తున్న జనం

జగనన్నకు అభిమానం హోరెత్తింది.. అడుగడుగునా పూలవర్షం కురిసింది... సేవలకు సలాం అంటూ ప్రజల్లోకి వచ్చిన జననేతకు జేజేలు పలికారు.. సంక్షేమ పథకాల అందించటంలో ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా... వేకువజామునే అవ్వాతాతలను ఆదరించే యోధులుగా.. కరోనా కాలంలో అపద్బాంధవులుగా.. ప్రజా జీవితంలో మమేకమైన వాలంటీర్ల ప్రతిభకు పట్టం కట్టారు. సేవా అవార్డులు అందజేశారు. అందుకు ఫిరంగిపురం మండలంలోని రేపూడి సెయింట్ పాల్స్ స్కూల్ ఆవరణ వేదికైంది.

– ఫిరంగిపురం



థాంక్యూ జగనన్న .. ప్లకార్డులతో తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తున్న అభిమానులు



అన్నకు అండ .. జగనన్నకు అండగా ఉంటామని జై కొడుతున్న వలంటీర్ చెల్లెమ్మలు



అభిమానం ఫొటోలా... ఫొటో ప్రదర్శిస్తూ ఓ వలంటీర్ ఉత్సాహం

పారిశ్రామిక సమ్మెను జయప్రదం చేయండి

రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జొన్నా శివశంకరరావు



సమావేశంలో మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జొన్నా శివశంకరరావు

తాడేపల్లిరూరల్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశవ్యాప్తంగా రోడ్ ట్రాన్స్‌పోర్ట్‌కు విరుద్ధంగా తీసుకువచ్చిన వాహన చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ జాతీయ కార్మిక సంఘాలు, రైతు సంఘాలు నిర్వహించనున్న పారిశ్రామిక సమ్మెను జయప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జొన్నా శివశంకరరావు అన్నారు. ఎంటీఎంసీ పరిధిలోని పెనుమాకలో గురువారం విస్తృత ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో కొలనుకొండ గ్రామ సిపిఎం పార్టీ కార్యదర్శి కాట్రగడ్డ శివన్నారాయణ, కాట్రాగడ్డ శివరామకృష్ణ, వడ్లవటి రమేష్ పాల్గొన్నారు.

నేడు గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయండి

తాడేపల్లిరూరల్: కేంద్ర ప్రభుత్వం డ్రైవర్లపై తీసుకువచ్చిన చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ అఖిల భారత రవాణా కార్మిక సంఘాలు దేశవ్యాప్తంగా నిర్వహించనున్న బంద్‌ను జయప్రదం చేయాలని సీఐటీయూ మండల ఉపాధ్యక్షులు జెట్టి బాలరాజు కోరారు. గురువారం దుగ్గిరాల మండల పరిధిలోని తుమ్మపూడిలో ఈ సందర్భంగా కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం డ్రైవర్లపై తీసుకువచ్చిన చట్టం న్యాయ సంహిత సెక్షన్ 106(1) మరియు 2ను రద్దు చేయాలని కోరుతూ నిర్వహించనున్న నిరసన కార్యక్రమాన్ని ఉదయం 11 గంటలకు దుగ్గిరాల గ్యాస్ కంపెనీ నుంచి ఎంపీడీఓ కార్యాలయం వరకు నిర్వహించనున్నామని చెప్పారు. కార్యక్రమంలో కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు, కౌలు రైతులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు వై.శ్రీను, కె.శ్రీను, సిహెచ్.వందనం, ఎస్కే రఫీ, సిహెచ్.పోతురాజు, వై.బ్రహ్మేశ్వరరావు, అమ్మిరెడ్డి పాల్గొన్నారు.

కేఎల్‌యూలో పుట్టగొడుగుల పెంపకంపై శిక్షణ



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న రత్నప్రసాద్ బాబు, డాక్టర్ బాలకృష్ణ

తాడేపల్లిరూరల్: ఎంటీఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ విశ్వవిద్యాలయంలో పుట్టగొడుగుల పెంపకంపై శిక్షణ తరగతులను గురువారం ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పుట్టగొడుగుల పెంపకం శిక్షకులు తోట జయచంద్ హాజరయ్యారు. తనుశ్రీ మష్రూమ్స్ సంస్థ ద్వారా వ్యవసాయ విభాగ విద్యార్థులకు పుట్టగొడుగుల పెంపకం గురించి అవగాహన కల్పించారు. కేఎల్‌యూ వ్యవసాయ కళాశాల డైరెక్టర్ డాక్టర్ పి.రత్నప్రసాద్, భారతదేశ వ్యవసాయ భూభాగంలో పుట్టగొడుగుల పెంపకం యొక్క ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు. వ్యవసాయ విభాగాధిపతి డాక్టర్ బి.బాలకృష్ణ మాట్లాడుతూ శిక్షణ తరగతులు మూడు రోజులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆధునిక వ్యవసాయ విధానాలలో వచ్చిన మార్పులను విద్యార్థులకు వివరించామని, పుట్టగొడుగుల పెంపకం యొక్క అవకాశాలను విద్యార్థులు ఉపయోగించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో వైస్ చాన్సలర్ డాక్టర్ జి. పార్థసారథి వర్మ, ప్రొ వైస్ చాన్సలర్లు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, ఎంహెచ్ఎస్ డీన్ ఎం.కిషోర్‌బాబు, లైఫ్ సైన్సెస్ డైరెక్టర్ డాక్టర్ ఎన్. బుచ్చినాయుడు, ఆర్గనైజింగ్ కమిటీ డాక్టర్ పి.అవినాష్, డాక్టర్ ఎం.ఉదయ్‌భాస్కర్ పాల్గొన్నారు.

మార్కెట్ యార్డు అభివృద్ధికి కృషి



చైర్మన్‌ను సన్మానిస్తున్న అధికారులు, సభ్యులు

గుంటూరు రూరల్: ప్రత్తిపాడు వ్యవసాయ మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్‌గా ఏటుకూరుకు చెందిన ఆళ్ళ రవిదేవరాజు గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. నగరంలోని జేడీఏ కార్యాలయంలో జరిగిన ప్రమాణ స్వీకారం కార్యక్రమంలో జిల్లా అగ్రిటెక్ అండ్ మార్కెటింగ్ ఆఫీసర్ శ్రీనివాసరావు నూతన చైర్మన్‌తో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా నూతన చైర్మన్‌ను కమిటీ సభ్యులు, ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. అనంతరం నూతన చైర్మన్ మాట్లాడుతూ 19 మందితో కూడిన నూతన కమిటీ నియామకం జరిగిందని చెప్పారు. ప్రత్తిపాడు వ్యవసాయ మార్కెట్ యార్డ్ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో అధికారులు, డైరెక్టర్ బొల్లెద్దుల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

చెరువునూ వదలని పచ్చ బ్యాచ్



కాజ పుల్లయ్య నగర్‌లో తవ్వి చదును చేసిన చెరువు కట్ట



చెరువు కట్ట వెంబడి పొక్లెయిన్‌తో తవ్విన దృశ్యం

- కాజలో టీడీపీ నేతల కన్ను
- పేదల ముసుగులో ప్లాట్ల ఏర్పాటు
- చెరువు భూమిని కట్టలు తెంచి చదును చేసిన వైనం
- తూతూ మంత్రంగా చర్యలు చేపట్టిన అధికారులు
- ఆక్రమణకు గురి కాకుండా చెరువు చుట్టూ కట్టలు ఏర్పాటు

తాడేపల్లిరూరల్: పచ్చ బ్యాచ్‌లో మార్పు లేదు. ప్రభుత్వం ఎన్ని చర్యలు తీసుకున్న వాళ్ల పని వాళ్లు కనిస్తున్నారు. అధికారుల కన్నుగప్పి ఆక్రమణలకు బరితెగిస్తున్నారు. చివరికి ఊరు చెరువునూ వదలేదు. పేదలకు ప్లాట్ల పేరుతో కాజలో దోపిడికి తెర తీశారు. టోల్‌గేట్ సమీపంలో జాతీయ రహదారి పక్కనే పుల్లయ్యనగర్‌లోని అర ఎకరం చెరువును ఆక్రమించేందుకు పన్నాగం వేశారు. వివరాలు.. కాజ గ్రామంలోని పుల్లయ్యనగర్‌లో సర్వే నంబరు 310 ఏ2లో గతంలో ఆక్రమణకు గురి కాగా సుమారు 8 ఎకరాల చెరువు మిగిలింది. మంగళగిరి- తాడేపల్లి కార్పొరేషన్ ఏర్పడిన తరువాత ఉన్న చెరువులను కాపాడేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఆక్రమణలకు గురైన వాటిని వదిలేసి మిగతా చెరువులో చుట్టూ పటిష్టంగా కట్టలు ఏర్పాటు చేశారు. అదే క్రమంలో కాజలో జాతీయ రహదారి వెంబడి గుంటూరు నుంచి విజయవాడ వెళ్లే మార్గంలో రోడ్డు వెంబడి ఆక్రమణకు గురికాగా మిగిలిన చెరువు చుట్టూ కట్టలు ఏర్పాటు చేసి గ్రావెల్ రోడ్డు, సీసీ రోడ్డు ఏర్పాటు చేశారు.

కట్ట ఏర్పాటుపై టీడీపీ నేతల అభ్యంతరం..

భవిష్యత్ తరాల వారికి తాగునీటిని అందించేందుకు ఎంటీఎంసీ అధికారులు ఆ చెరువును బాగుచేయించి తాగునీటి చెరువుగా తీర్చిదిద్దేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. అదే గ్రామానికి చెందిన కొంతమంది టీడీపీ నాయకులు చెరువు కట్టలు వేస్తున్నప్పుడు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇప్పుడు ఏకంగా అధికారులు సెలవులో ఉన్న సమయంలో ఆ కట్టలను తొలగించి చదును చేసి, ప్లాట్లు వేసేందుకు రంగం సిద్ధం చేశారు. జాతీయ రహదారి పక్కనే ఉండడంతో చిన్న, మధ్య తరగతి కుటుంబాల వారికి సెంటు రూ.2 లక్షల చొప్పున అమ్మేందుకు రంగం సిద్ధం చేసినట్లు సమాచారం.

కట్టను చదును చేసి మరీ..

కాజలోని సచివాలయ సిబ్బంది ఇతర అధికారులు జరుగుతున్న తతంగాన్ని చూసీచూడనట్లు వదిలేయంతో సుమారు 150 మీటర్ల పొడవున పటిష్టంగా ఏర్పాటు చేసిన చెరువు కట్టను తొలగించి ప్లాటుగా ఏర్పాటు చేశారు. మరో పక్క మరో ప్లాట్ చదును చేసి ఏకంగా ఇళ్ల నిర్మాణ పనులు చేపట్టారు. మీడియా ద్వారా విషయం తెలుసుకున్న అధికారులు తూతూ మంత్రంగా ఆక్రమణలను అడ్డుకున్నారు. కానీ, కట్టను తవ్వుతున్న పొక్లెయిన్, కట్ట తొలగించే వారిపై ఎటువంటి చర్యలు తీసుకోలేదు. మరోపక్క చెరువును ఓ పక్క నుండి పూడ్చుకుంటూ ఆక్రమణలు చేస్తున్నారు. ఆక్రమించుకున్న భూమి విలువ సుమారు కోటి రూపాయలు ఉండవచ్చని స్థానికులు చెబుతున్నారు. చెరువును ఆక్రమించుకుని ఇళ్ల నిర్మాణం చేస్తే భవిష్యత్ తరాలకు తీరని నష్టం జరుగుతుందని, గుంటూరు చానల్ నుంచి నీటిని తీసుకుని శుద్ధి చేసి కాజతో పాటు చిన కాకాని, వెంకటరెడ్డి పాలెం ఇతర ప్రాంతాలకు సంవత్సరం పొడవుగా నీటిని అందించవచ్చని, అధికారులు ఇప్పటికైనా స్పందించి చెరువు ఆక్రమణకు గురి కాకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుకుంటున్నారు.

కాజ గ్రామ కార్యదర్శి రమేష్ ఏమన్నారంటే..

చెరువు ఆక్రమణపై పంచాయతీ సెక్రటరీ రమేష్‌ను వివరణ కోరగా చెరువు కరకట్టను తవ్విన మాట వాస్తవమేనని, నేను సెలవులపై ఉన్నానని, ఘటనపై కార్పొరేషన్ అధికారులకు సమాచారం ఇచ్చానని, తాత్కాలికంగా చెరువు కరకట్ట తవ్వకాలు నిలిపివేశారని, వారెవరో గుర్తించి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

జీజీహెచ్‌లో సీటీస్కాన్ ఏర్పాటుకు భూమిపూజ

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకులకిరణ్ కుమార్ చెప్పారు. గురువారం ఆసుపత్రి రేడియాలజీ విభాగంలో సిటీస్కాన్ పరికరం ఏర్పాటుకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఆసుపత్రి అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం మరమ్మతుల బడ్జెట్ కింద రూ.5 కోట్లు కేటాయించారన్నారు. అందులో భాగంగా సీటీ స్కాన్ పరికరం ఏర్పాటుకు రూ.4 కోట్లు ఖర్చు పెడుతున్నట్లు తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు జీజీహెచ్‌కు రెండో సీటీ స్కాన్ పరికరం అవసరమని భావించి బడ్జెట్ విడుదల చేశారన్నారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని, ఎం.టి.కృష్ణబాబు, ఏపీ ఎంఎస్ఐడీసీ ఎండీ మురళీధర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, ప్రజా ప్రతినిధులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే రోజుల్లో రేడియాలజీ విభాగాన్ని అద్భుతంగా తీర్చదిద్దబోతున్నట్లు వెల్లడించారు. సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ బత్తుల వెంకటసతీష్ కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ కె.ఆశ సజని, ఏపీఎంఎస్ ఐడీసీ ఏఈ రత్తయ్య, పలువురు ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకటన

[illegible] ... తేదీ:15-02-2024. అంబటి సంజయ్ కుమార్, న్యాయవాది. #24-25-73, 2nd క్రాస్ రోడ్, బాలాజీ నిలయం, సూర్యారావుపేట, విజయవాడ-2. Cell: 9849077779.



దుగ్గిరాలలో వైఎస్సార్‌సీపీ కార్యాలయం ప్రారంభోత్సవం సందర్భంగా బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న పార్టీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు - తాడేపల్లి రూరల్



పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న నియోజకవర్గ సమన్వయకర్త గంజి చిరంజీవి, పక్కన విజయసాయి రెడ్డి, కాండ్రు కమల తదితరులు